సీడీసీ డీన్‌గా ఆచార్య సత్యనారాయణ రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు సత్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఆచార్య సత్యనారాయణ పదవీ కాలం ముగియడంతో నూతన డీన్‌గా ఆచార్య సత్యనారాయణ రెడ్డిని నియమించారు.







పెదగదిలి టీచర్లపై డీఈవో ఆగ్రహం



పెదగదిలి ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులు రాసిన వర్క్ బుక్‌లు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: పెదగదిలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా విద్యా శాఖాధికారి ఎల్. చంద్రకళ సందర్శించారు. ఇక్కడ విద్యార్థులు రాసిన వర్క్ బుక్‌లు పరిశీలించారు. వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పిల్లలు వర్క్ బుక్‌లను ఉపాధ్యాయులు సరిగా దిద్దకపోవడం, గణితం, తెలుగు వర్క్ బుక్‌లో విద్యార్థులు తప్పుడు సమాధానాలు రాయడం, ఆ సమాధానాలను సైతం ఉపాధ్యాయులు రైట్ టిక్ పెట్టడం ఆమె గుర్తించారు. దీంతో పాటు ఇక్కడ మూడో సెమిస్టర్ ఇంకా ప్రారంభించ లేదు. అభ్యసనా సామర్థ్యాలలో విద్యార్థులు బాగా వెనుకబడి ఉండటంతో పాటు విధిలో నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులపై డీఈవో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్క్ బుక్‌లలో విద్యార్థులు తప్పుగా రాసినప్పటికీ.. వాటిని ఉపాధ్యాయులు సరిచేయకపోవడంపై ప్రశ్నించారు. ఒకటో తరగతి విద్యార్థులు సరిగా అక్షరాలు గుర్తించలేకపోవడం, 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఎక్కువమంది తెలుగు, ఆంగ్లం పదాలు చదవలేక పోవడంపై మండిపడ్డారు. పాఠశాల ఉపాధ్యాయులందరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు తన వృత్తిని సక్రమంగా నిర్వర్తించాలని.. లేకపోతే సక్రమమైన ఫలితాలు సాధించలేమన్నారు. ఆమె వెంట జిల్లా విద్యా శిక్షణ సంస్థ అధ్యాపకుడు జి.రవి ఉన్నారు.

అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్ర బడ్జెట్

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని రంగాల అభివృద్ధి ఆధారిత బడ్జెట్‌లా ఉందని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఏపీసీసీఐ) ప్రెసిడెంట్ కరుణేంద్ర అన్నారు. ఎఫ్ఏపీసీసీఐ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2023–204 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.6 వేల కోట్ల పెట్టుబడితో కొత్తగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులు, చేపల విక్రేతలు, సూక్ష్మ, చిన్న పరిశ్రమల కార్యకలాపాలను వాటి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఇది ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ పరిశ్రమను ప్రోత్సహిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈలకు బడ్జెట్‌లో రికార్డు స్థాయిలో నిధులు కేటాయించారని ఇది దేశంలో ఉపాధికి ఊతం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఏ అనిల్ కుమార్, డాక్టర్ హేమ యడవల్లి, సీఏ గౌతమ్ ఫరాఖ్ తదితరులు ప్రసంగించారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్(ఎఫ్ఆర్ఎస్) హాజరు 100 శాతం సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయం సమావేశ మందిరంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులతో పలు అంశాల మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో అమలు కానున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ గురించి.. స్పెషలిస్టు డాక్టర్ సేవల మీద.. పట్టణ ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు.

భార్యపై కానిస్టేబుల్ హత్యాయత్నం

ఆరిలోవ: భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన ఓ భర్తపై ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలివి.. ఫైర్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆర్.శ్రీను భార్య, ఇద్దరు పిల్లలతో కలసి పైనాపిల్‌కాలనీ దరి ధారపాలెంలో నివాసముంటున్నాడు. వారికి వివాహం జరిగి ఐదేళ్లవుతోంది. శ్రీను కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేయాలని అతనికి భార్య సుకన్య జాగ్రత్తలు చెప్పేది. దీంతో తరచూ వారిద్దరి మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతుండేది. ఈ నేపథ్యంలో ఈ నెల 2న రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన శ్రీనును ఆమె నిలదీసింది. దీంతో ఆగ్రహించిన శ్రీను ఇంట్లో కూరగాయల కత్తి తీసుకుని ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో సుకన్య ముఖం, చేతులపై గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం కావడంతో స్థానికులు ఆమెను హెల్త్‌సిటీలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న సుకన్య అన్న జామి సురేష్ శ్రీనుపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన చెల్లిపై హత్య చేయడానికి ప్రయత్నించాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నిరుపయోగంగా ఉన్న
పరీక్ష సామగ్రి తరలింపు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో కుప్పలుతెప్పలుగా పేరుకుపోయి ఉన్న పరీక్షలకు సంబంధించిన సామగ్రికి ఎట్టకేలకు మోక్షం లభించింది. వార్షిక పరీక్షలకు సంబంధించి జవాబులు రాసేందుకు విద్యార్థులకు అందజేయగా, మిగిలిన బుక్‌లెట్‌ను గత మూడేళ్లుగా కార్యాలయంలోనే ఉండిపోయాయి. కోవిడ్ సమయంలో రెండేళ్లు పరీక్షలు జరగలేదు. కానీ అప్పటికే సామగ్రిని ఆర్ఐవో కార్యాలయానికి రావడంతో అదంతా నిరుపయోగంగా ఉంది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెలలో ప్రారంభమవుతాయి. అదే విధంగా వార్షిక పరీక్షలు మార్చిలో మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించిన సామగ్రి మళ్లీ ఆర్ఐవో కార్యాలయానికి త్వరలోనే రానుంది. దీంతో వాటిని భద్రపరిచేందుకు వీలుగా కార్యాలయంలోని గదుల్లో ఉన్న సామగ్రిని శనివారం వేరే ప్రాంతానికి తరలించారు. బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిరుపయోగంగా ఉన్న పరీక్ష సామగ్రిని తరలించినట్లు ఆర్ఐవో ఉమారాణి తెలిపారు.

కంచికామకోటి పీఠాధిపతి
ఎంవీపీ శివాలయం సందర్శన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ సిద్ధివినాయక పార్వతీ ముక్తేశ్వర ఆలయాన్ని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ శనివారం సందర్శించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి బుచ్చిలింగంతో పాటు అధ్యాత్మికవేత్త సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై చర్చా కార్యక్రమం

ఏయూక్యాంపస్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) విశాఖ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2023పై శనివారం చర్చా కార్యక్రమం జరిగింది. ఐఐఎం విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.మాధవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బడ్జెట్ ప్రత్యేకతలను వివరించారు. సీఏ జగదీష్ కుమార్, విశాఖ కేంద్రం అధ్యక్షుడు సీఎస్ గిరిధరన్, ఉపాధ్యక్షుడు మనోజ్ ప్రకాష్, కార్యదర్శి శివ కుమార్, చలపతిరావు, అమర్‌నాథ్ తదితరులు మాట్లాడారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ప్రారంభం

మద్దిలపాలెం: ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్పించేందుకు సుశిక్షితులైన ఇన్‌స్ట్రక్టర్లతో ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నామని జోన్–1 డీపీటీవో అప్పలరాజు తెలిపారు. మద్దిలపాలెం డిపోలో 25 మందికి శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి ట్రైనర్లు ఎస్.ఈశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, చీఫ్ మెకానికల్ ఇంజనీరు బి.అప్పలనాయుడు తొలి రోజు శిక్షణ కార్యక్రమంలో పలు సూచనలు చేశారన్నారు. కొత్త టెక్నాలజీతో కూడిన బస్సుల గురించి అవగాహన కల్పించనున్నామని జోన్–1 డీపీటీవో అప్పలరాజు తెలిపారు. వీటికి ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు.










సౌందర్యలహరిలో ప్రతి శ్లోకం విశిష్టం



ప్రవచనాలు చేస్తున్న బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీకాలనీ: శ్రీ విద్యా ఉపాసనల్లో విశిష్టమైనది సౌందర్యలహరి అని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీ శక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీ సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. జగద్గురు ఆదిశంకరాచార్య రచించిన సౌందర్యలహరిలో వంద శ్లోకాలు ఉన్నాయన్న ఆయన అందులో ప్రతీ శ్లోకం విశిష్టమైనదేనన్నారు. నిరంతరం ప్రసరించే అఖండ చైతన్యమే అమ్మ అని, ఆమెను సౌందర్యలహరిగా కీర్తించిన రుషులు ఆరాధనీయులని అన్నారు. దొర్బల ప్రభాకరశర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మహాత్ముల ఆచరణాత్మక సందేశాలే మార్గదర్శకం అన్నారు. ఈనెల 12వ తేదీ వరకు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రవచనాలతో పాటు సాంస్కృతిక, అధ్యాత్మిక కార్యక్రమాలను జరుగుతాయని శ్రీమాత భక్త బృందం వెల్లడించింది. శనివారం జరిగిన ప్రవచనాల కార్యక్రమంలో నగర భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

బీచ్‌రోడ్డు: ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ముందస్తు జన్మదిన వేడుకలు శనివారం చిన్నవాల్తేర్ మున్సిపల్ పాఠశాలలో ఘనంగా జరిగాయి. విద్యార్థులకు ఆయన పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మధుపాడ రవికుమార్, గొంపా చంద్రమౌళి, కాశీ, విజయ, కమల్, శ్రీకాంత్, సత్యారావు, నాగరాజు, తౌఫిక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి నగదు పురస్కారం

ఏయూక్యాంపస్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలో జరిగిన టోర్నమెంట్‌లో కేడీపీఎం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఏ.చరణ్ తేజ పతకం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ స్మార్ట్ సిటీ సభ్యులు రూ.1000 పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ అధ్యక్షుడు మురళి, సంయుక్త కార్యదర్శి రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమతి భాయి, క్రీడా అధ్యాపకులు యు.ఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నివారణ

బీచ్‌రోడ్డు: ఏయే అలవాట్ల వలన క్యాన్సర్ వస్తుందో అవగాహన ఉంటే నివారణ సులువని చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.సుబ్బలక్ష్మి అన్నారు. శనివారం ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. మహిళలు ముఖ్యంగా క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ర్యాలీలో ఫౌండేషన్ సభ్యులు శివాని, శివకుమారి, జయ పాల్గొన్నారు.

హెల్త్‌సిటీలో..

ఆరిలోవ: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం హెల్త్‌సిటీలో బృందా ఆస్పత్రి ఆధ్వర్యంలో ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ అవగాహన ర్యాలీ చేపట్టింది. ముడసర్లోవ వద్ద స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద ప్రారంభించిన ఈ ర్యాలీ దీన్‌దయాల్‌పురం, హెల్త్‌సిటీ మీదుగా చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం వరకు సాగింది.

కంప్యూటర్ సైన్స్ బీఓఎస్ చెర్‌పర్సన్‌గా లలిత భాస్కరి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చెర్‌పర్సన్‌గా విభాగ ఆచార్యులు డి.లలిత భాస్కరి నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను లలిత భాస్కరి స్వీకరించారు.

కంటి క్యాన్సర్‌పై జాగ్రతలు పాటించాలి

ఆరిలోవ: కంటి క్యాన్సర్‌పై జాగ్రతలు పాటించాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు నేహ, అఖిల తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం హనుమంతవాక వద్ద ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ ఏడాది మే 21న బీచ్ రోడ్డులో భారీ మారథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది కళ్ల పరీక్షలు జరిపించుకోవాలన్నారు.

భారతీయ సంగీతం విశిష్టమైనది

ఏయూక్యాంపస్: భారతీయ సంగీతం ఎంతో విశిష్టమైనది ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. శనివారం ఏయూ సంగీత విభాగం సమావేశ మందిరంలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటశాల వెంకటేశ్వర రావులపై నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావు, విభాగాధిపతి ఆచార్య ఏ.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం

ఏయూక్యాంపస్: స్థానిక పెదవాల్తేరులోని అసంగానంద ఆశ్రమంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు శ్రీ శివలింగ, నందీశ్వర, ధ్వజస్తంభ శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తామని ఆశ్రమ ట్రస్ట్ బోర్డ్ ఉపాధ్యక్షుడు ఎం.వి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. 1976వ సంవత్సరంలో చిన్నపిల్లి కొండలరావు దాతృత్వంతో విశాఖలో నెలకొల్పిన ఈ ఆశ్రమంలోని కొంత భాగంతో పాటు దేవాలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో పాతవాటిని తొలగించి వాటిస్థానే నూతనంగా నిర్మిస్తున్నామన్నారు.





సామాజిక బాధ్యత అవసరం

బీచ్‌రోడ్డు: సామాజిక బాధ్యతతో ప్రతీ ఒక్కరు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో శనివారం వారియర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. న్యూ హోప్ ఫౌండషన్ వ్యవస్థాపకులు మల్లీశ్వరి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన వారిని గుర్తించి అవార్డులు అందజేసిన నిర్వాహకులను అభినందించారు. ప్రతీ ఒక్కరూ ఏదో ఒక దశలో తోటి వారికి తగిన సహాయం అందించాలని పిలుపు నిచ్చారు. న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లీశ్వరి మాట్లాడుతూ తాము చేస్తున్న మంచి కార్యక్రమాలకు ప్రజల నుంచి అనుహ్య స్పందన వస్తుందన్నారు. సేవే ధ్యేయంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందని చెప్పారు. జీవీఎంసీ సిబ్బంది, జర్నలిస్టులు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు అతిథుల చేతుల మీదుగా అవార్డులను అందజేశారు.



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

ఆరోగ్యమైన విద్యా బోధన జరగాలి

ఆరిలోవ: విద్యార్థులకు ఆరోగ్యకరమైన విద్యాబోధన జరగాలని సెంచూరియన్ వర్సిటీ వీసీ జి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. విశాఖ వేలీ స్కూల్‌లో శనివారం నగరంలో సీబీఎస్ఈ పాఠశాలల ఉపాధ్యాయులకు 'సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం' పేరుతో రెండు రోజుల వర్క్ షాపు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు దాని గురించి అవగాహన ఉండాలన్నారు. అలాంటప్పుడే విద్యార్థులకు ఆరోగ్యంపై వివరించగలరన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్‌కు సంబంధించిన వర్క్‌షాపు నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖవేలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం రెండు రోజులు జరగనుందన్నారు. తనతో పాటు స్టీల్‌ప్లాంట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.కె పాండే రిసోర్స్ పర్సన్లగా వ్యవహరిస్తున్నామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 30 సీబీఎస్‌సీ పాఠశాలల నుంచి 80 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. ఇవన్నీ ఉపాధ్యాయులు, విద్యార్థులు శారీరక, మానశిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడతాయన్నారు.



